అమ్మపాలు.. అమృతతుల్యం

- రోగనిరోధక శక్తి పెంపు, శిశువు ఆరోగ్యానికి దోహదం
- నేటి నుంచి 8వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు

ఎమ్మిగనూరురూరల్: బిడ్డ భూమిపైకి వచ్చి కళ్లు తెరిచిన తొలి క్షణం చూసేది తల్లి ముఖాన్నే.. వెతికేది తల్లి పాలనే. శిశువు ఆయుష్షు, ఆరోగ్యం పెంచడంలో తల్లిపాల కీలకపాత్ర పోషిస్తాయి. అమ్మపాలు అమృతంలో సమానం. బిడ్డకు తొలి ఆహారం అమ్మపాలు, ఇది ప్రకృతి వరం. దీనికి మరేదీ సాటిరాదు. అయితే కొన్ని అపోహలు.. ఆధునిక పోకడతో కొందరు తల్లులు బిడ్డలకు శ్రేష్టమైన తల్లిపాలను దూరం చేస్తున్నారు. దీంతో శిశు మరణాలు ఏటా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏటా ఆగస్టు మొదటి వారంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ తల్లిపాలవిశిష్టతను తెలియజేస్తున్నారు.

నేటి నుంచి వారోత్సవాలు..

ఎమ్మిగనూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఎమ్మిగనూరు టౌన్‌లో 75 కేంద్రాలు, రూరల్‌లో 81, గోనెగండ్ల మండలంలో 68, నందవరం మండలంలో 58 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రాజెక్ట్ పరిధిలో గర్భిణులు 3279 మంది, బాలింతలు 2944 మంది ఉన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం(ఐసీడీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు తల్లిపాల ప్రాముఖ్యత, ముర్రుపాలతో కలిగే ప్రయోజనాలు తదితరల అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే సభలు, సదస్సులు నిర్వహిస్తున్నారు.



కందనాతి గ్రామంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం(ఫైల్)

తల్లిపాలలో ఔషధ గుణాలు

పుట్టిన శిశువుకు గంటలోపే తల్లిపాలు తప్పనిసరిగా తాపిస్తే రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. కామెర్ల, టైఫాయిడ్, మలేరియా తదితర వ్యాధులను నిర్మూలించే గుణాలు తల్లిపాలలో ఉన్నాయి. బిడ్డ బరువు పెరిగేందుకు ఇవి దోహదపడతాయి. పగటి పూట ఇచ్చే పాల కన్నా రాత్రిపూట బిడ్డకు పాలివ్వడం ద్వారా బిడ్డ ఎదుగుదల బాగా ఉంటుంది. ఫలితంగా తల్లికి బిడ్డకు మంచి బంధం ఏర్పడుతుంది. పాలిచ్చేటప్పుడు తల్లిఒడిలోని వేడి వల్ల బిడ్డకు చేరి చాల వ్యాధులు దరిచేరవు. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగిస్తే శిశుమరణాలు తగ్గుతున్నట్లు అధ్యయనాల ద్వారా వెల్లడైంది.

కేన్సర్ దూరం..

ప్రస్తుతం అనేక మంది స్త్రీలు రొమ్ము కేన్సర్ బారిన పడుతున్నారు. దీనికి ముఖ్య కారణం బిడ్డకు పాలివ్వకపోవడమే. శిశువుకు తొలి ఆరు నెలలు బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లికి రొమ్ము కేన్సర్ బారినపడే అవకాశాలు చాల తక్కువగా ఉంటాయి.

ఆరు నెలలు తల్లిపాలు ఇవ్వాలి



పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకూ తల్లిపాలివ్వాలి. బాలింతలు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా రోజుకు 10 నుంచి 12 సార్లు బిడ్డకు పాలు ఇవ్వాలి. బిడ్డ ఏడ్చిన ప్రతిసారీ పాలు పట్టించవచ్చు. ఆరు నెలలు వరకు తల్లిపాలు ఇస్తే బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతుంది.

– డాక్టర్ బాలజీకుమార్, చిన్నపిల్లల వైద్యుడు, ప్రభుత్వాసుపత్రి, ఎమ్మిగనూరు

ముర్రు పాల ఆవశ్యకత వివరిస్తున్నాం



అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి గర్భిణికి, బాలింతకు తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రపాలు ఇచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం. తల్లిపాలు వారోత్సవాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాం.

– సఫరున్నీసాబేగం, సీడీపీఓ ఎమ్మిగనూరు

క్లుప్తంగా

ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలి



కిట్లను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

కౌతాళం: ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను ఉపయోగించుకుని విద్యార్థులు బాగా చదివి ఉత్తమ భవిష్యత్తుకు బాటవేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డేవిడ్, రవికుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కౌతాళంలో డ్రైనేజీ, గ్రావెల్ రోడ్ల నిర్మాణం



ఓ వీధిలో వేసిన గ్రావెల్ రోడ్డు

కౌతాళం: మండల కేంద్రంలోని హనుమన్‌నగర్‌లో నాల్గు రోడ్లకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో డ్రైనేజీ నిర్మాణంతో పాటు గ్రావెల్ రోడ్డు వేసినట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. హనుమన్ నగర్‌లో రోడ్లన్ని మట్టివి కావడంతో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని గ్రావెల్ వేయాలని కాలనీ వాసుల కోరడంతో ఈ పనుల్ని చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామంలో పనులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తామన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



డి.బెళగల్‌లో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య బృందం

కోసిగి: కుష్టు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని ఎంపీహెచ్ఈఓలు శ్రీనివాసులు, రాముడు సూచించారు. బుధవారం మండలంలోని డి.బెళగల్, చింతకుంట, పల్లెపాడు గ్రామాల్లో అంగన్ వాడీ, ఆశావర్కర్లుతో హెల్త్ సిబ్బంది ఇంటింటా తిరిగి సర్వే చేసి కుష్టు వ్యాధి పై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ కుష్టు వ్యాధి బహుళ ఔషధ చికిత్స ద్వారా పూర్తిగా నయమవుతోందన్నారు. ముందుగా కుష్టు వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్స్ సుశీలమ్మ, అనిత, ఏఎన్ఎమ్ రేఖశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పరిశీలన



కుళాయి నీటిని పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ ప్రజలకు కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిని బుధవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ మనోహర్‌రెడ్డి పరిశీలించారు. స్థానిక గాంధీనగర్‌లో కుళాయిల నీటిని తీసుకొని అందులో క్లోరిన్, బ్యాక్టీరియల్ టెస్టింగ్ చేశారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది కొళాయిల ద్వారా వచ్చే తాగునీటిని టెస్టింగ్ చేసి అవసరమైన చర్యలు తీసుకొని, ప్రజలకు మంచినీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అనంతరం గాంధీనగర్‌తో పాటు వైఎస్సార్ సర్కిల్‌లో పారిశుద్య పనులను కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో టీపీఓ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం సీఐగా రామాంజులు



మంత్రాలయం: మంత్రాలయం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి. రామాంజులు నియమితులైయ్యారు. వైఎస్సార్ జిల్లా కాజీపేట సీఐగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ ఎరిసా వలిని వీఆర్‌కు పంపారు.

4న స్వర్ణామృత ప్రాసనం మందు పంపిణీ

ఆదోని అర్బన్: అవోపా ఆదోని వారి ఆధ్వర్యంలో ఈనెల 4న స్వర్ణామృత ప్రాసనం మందు ఉచిత పంపిణీ చేస్తున్నట్లు మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, ఎన్ఆర్ఐ నగేష్ కాకుబాళ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుష్యమి నక్షత్రం రోజైన ఆదివారం నాడు 6 నెలల నుంచి 16 సంవత్సరాల పిల్లలకు అందిస్తామన్నారు. శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఉదయం 7 గంటలకు మందు పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. ఈ ఔషధం వల్ల రోగనిరోధక శక్తి, మేధాశక్తి, ఆయుష్షును, చర్మ సౌందర్యాన్ని పెంచుతుందన్నారు. మానసిక శారీరక ఎదుగుదలకు దోహదం చేస్తుందన్నారు.

రజత పతకం సాధించిన విద్యార్థినికి అభినందన



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం జెడ్పీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని జె.రాధమ్మ ఆర్డీటీ క్రీడల్లో ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించిందని హెచ్ఎం ఇందిరాదేవి తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాలలో విద్యార్థినిని వారు అభినందించారు. ఆమె మాట్లాడుతూ జూలై 30న ఆలూరులో ఆర్డీటీ సంస్థ బాలికల పోటీలు నిర్వహించిందన్నారు. ఈ పోటీల్లో జె.రాధమ్మ 200 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించిందన్నారు. ఉపాధ్యాయులు రమణమూర్తి, రామన్న, పీఎంసీ చైర్మన్ బాలప్ప పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో లాభాలు

నందవరం: ఉద్యాన పంటలతో మంచి లాభాలు ఉంటాయని ఎపీఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని జొహరాపురం, సజీవపురం, పెద్దకొత్తిలి గ్రామాల్లో ఉద్యాన పంటలను పరిశీలించారు. మండలంలో 150 ఎకరాల్లో 130 మంది రైతులు కొబ్బరి, దానిమ్మ, మునగ, సపోట మొక్కలను పంపిణీ చేశామని తెలిపారు. అలాగే 20 ఎకరాల్లో మల్లెపూలు, పొనకలదిన్నెలో 20 ఎకరాల్లో శ్రీగంధం సాగు చేసినట్లు వివరించారు.

సేవాదృక్పథంతో పనిచేస్తే గుర్తింపు



మాట్లాడుతున్న రిటైర్డు బ్యాంక్ మేనేజర్ శివుడు

ఎమ్మిగనూరు: విధి నిర్వహణలో సేవాదృక్పథంతో పనిచేసిన ప్రతి ఉద్యోగి పదవీ విరమణ తరువాత కూడా ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని ఆంధ్ర ప్రగతి గ్రామీణబ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ శివుడు, విశ్రాంత ఉపాధ్యాయురాలు సుందరీబాయి అన్నారు. బుధవారం స్థానిక మెయిన్ పోస్టాఫీసు ప్రాంగణంలో పదవీ విరమణ పొందిన ముగతి బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ సోమశంకర్‌రెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పదవివిరమణతో ఉద్యోగులు తమ బాధ్యతలు తీరిపోయాయనో, వయస్సు పైబడిపోయిందనో భావించకూడదన్నారు. అంకితభావం, సేవాతత్పరతతో కుటుంబ అభ్యున్నతికి, సమాజశ్రేయస్సుకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఇన్‌చార్జ్ ఎస్పీఎం గురులింగయ్య, ఎండీ గోపాల్, యల్లయ్య, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంట వండిన ఉపాధ్యాయులు

కౌతాళం: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన వంట ఉపాధ్యాయులే వండాల్సి వచ్చింది. అధికార పార్టీకి చెందిన అనుచరులు రెండు వర్గాలు పాఠశాలలో మేమంటే మేము వంటలు వండాలంటూ వాగ్వాదానికి దిగారు. ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానియల్ ఇరు వర్గాలను నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో చివరకు చేసేదేమీ లేక ఉపాధ్యాయులే వంటలకు ఉపక్రమించారు.

హక్కుల సాధనకై ఉద్యమించాలి

ఆదోని రూరల్: ఆధిపత్య ప్రపంచ వాస్తవ పరిస్థితులపై అధ్యయనం పెంచుకుని చట్ట పరిధిలోని దళితుల హక్కుల సాధనకై ఉద్యమించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప పిలుపునిచ్చారు. బుధవారం ఆదోని మండలం సంతెకూడ్లూరు గ్రామంలో బుధవారం రెండోరోజూ కేవీపీఎస్ జిల్లాస్థాయి సామాజిక చైతన్యశిక్షణ తరగతుల్లో భాగంగా సమాజ పరిణామక్రమంపై సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గౌస్‌దేశాయి, దళితులు.. చట్టాలపై రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప బోధించారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్, తిమ్మన్న, జయరాజు, చిన్నమారయ్య, మునిస్వామి పాల్గొన్నారు.

కౌతాళం తహసీల్దార్‌గా మల్లికార్జున

కౌతాళం: మండల తహసీల్దార్‌గా మల్లికార్జున స్వామి, ఎంఈఓ-1గా ఆంజినేయులును నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. మల్లికార్జున స్వామి గతంలో కౌతాళం డిప్యూటీ తహసీల్దారుగా సేవలు అందించారు. ఎంఈఓ ఆంజినేయులు కూడా గతంలో ఇన్‌చార్జి ఎంఈఓగా విధులు నిర్వహించారు. రెగ్యూలర్ అధికారుల రాకతో మండల ప్రజలకు సమస్యలు తీరనున్నాయి.

ఆర్టీసీ కాలనీలో చోరీ

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీ లక్ష్మి ఎస్టేట్‌లో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు వీరచంద్రయాదవ్ ఇంట్లో చోరీ జరిగిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వీరచంద్రయాదవ్ ఆదివారం ఉదయం డోన్‌కు వెళ్లి.. బుధవారం రాత్రి ఇంటికి తిరిగొచ్చి చూడగా తలుపు తాళాలు పగటగొట్టి బీరువాలోని రూ.1.40 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా బీరువాలోని లాకర్‌లో 3 తులాల బంగారం, ఒకటిన్నర కేజీ వెండి ఉన్నాయని, అవి చోరీకి గురయ్యాయో లేదో తెలియదని.. పోలీసుల సూచన మేరకు లాకర్‌ను ముట్టుకోలేదని బాధితుడు తెలిపాడు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మిగనూరురూరల్: ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని బీ-ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డా. వి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో ఎర్రకోట సెయింట్ జాన్స్ కాలేజీ బీ-ఫార్మసీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సీజనల్ వ్యాధులపై క్యాంప్‌ను నిర్వహించారు. స్కూల్లోని విద్యార్థులకు పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.ఎస్ఎం.నాగేష్, హెచ్ఓడీ డా. రంగారెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు రాజశేఖర్, డా.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల స్వీపర్లకు కొత్త వేతనాలు ఇవ్వాలి

ఆదోని టౌన్: పట్టణంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో వంశ పారంపర్యంగా చాలీచాలని వేతనాలతో సేవలందిస్తున్న స్వీపర్లు (ఆయా)లుకు నూతన విద్యా విధానం ద్వారా కొత్త వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, తాలూకా అధ్యక్షుడు కల్లుబావిరాజు, నాయకులు వెంకన్న, ఉసేని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట స్వీపర్లు ఆందోళన చేశారు.

ఒకేషనల్ కళాశాలపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న నేషనల్ ఒకేషనల్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శేఖర్‌నాయుడు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా షాపింగ్ కాంప్లెక్స్‌లో కళాశాల నిర్వహిస్తూ ఒక్కో విద్యార్థి నుండి రూ.30వేలను ఫీజు రూపంలో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు మంజు, గణేష్, పవన్, మహానంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీల్లో రాజకీయ జోక్యం లేకుండా చూడాలి

ఆదోని సెంట్రల్: ఈ నెల 8న జరిగే పాఠశాల కమిటీల్లో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న కోరారు. బుధవారం ఎస్టీయూ భవనంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన ఆదోని, కౌతాళం నాయకుల సమావేశం జరిగింది. సమస్యత్మాక గ్రామాల్లో పోలీసుల భద్రతను కల్పించి ఎన్నికలను నిర్వహించాలని కోరారు. జిల్లా కార్యదర్శి గోపాల్, ఎస్టీయూ నాయకులు అంజినయ్య, ఈశ్వరయ్య, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

9న పార్లమెంట్ మార్చ్

ఆదోని రూరల్: ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన నిర్వహిస్తున్న పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఏ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎస్.నాగార్జున పిలుపునిచ్చారు. పట్టణంలో బుధవారం ఏఐఎస్ఏ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించిందన్నారు.

ఏసీఎల్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: ముందస్తు విచారణ చేపట్టకుండా కొత్తగా యూనియన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (ఏసీఎల్)పై చర్యలు తీసుకోవాలని ఆలూరు నియోజకవర్గ ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. కొత్త యూనియన్ వల్ల పాత హమాలీలకు ఉపాధి దొరకక కార్మికుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొందన్నారు. బుధవారం ఏఐటీయూసీ ఆలూరు నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో బజారు హమాలీ కార్మికులు కుటుంబ సభ్యులతో కలిసి పట్టణ ప్రధాన వీధులగుండా ప్రదర్శనగా వెళ్లి సబ్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె.అజయ్‌బాబు, ఆలూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పి.రామాంజనేయులు పాల్గొన్నారు.

రసాభాసగా కౌన్సిల్ మీట్

- వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం
- ఎంతవారించినా వినకపోవడంతో సభను ముగించిన చైర్మన్ రఘు



ఇరువర్గాలను వారిస్తున్న చైర్మన్ కేఎస్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో బుధవారం చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం రసాభాసగా మారింది. కౌన్సిల్‌లో అజెండాలోని 18వ అంశాన్ని వాయిదా వేసి మిగిలిన 24 అంశాలను ఆమోదం తెలుపుతున్నట్లు వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ ప్రకటించగా.. మెజారిటీ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు అందుకు మద్దతు తెలిపి తీర్మానం చేశారు. వైస్ చైర్మన్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో వైఎస్సార్‌సీపీ తరఫున గెలుపొందిన ఐదుగురు కౌన్సిలర్లు టీడీపీలో చేరి ఆ పార్టీ కండువాలు వేసుకొని కౌన్సిల్‌కు రావడంపై అసహనం వ్యక్తం చేశారు. పట్టణాభివృద్ధికి తాము ఎల్లప్పుడు మద్దతు ఇస్తామని పేర్కొంటుండగా టీడీపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లతో పాటు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన కౌన్సిలర్లు అడ్డుతగిలారు. దీంతో వారి మధ్య వాదోపవాదాలు జరిగాయి. చైర్మన్ ఎంత వారించినా సభ్యుల మధ్య వాగ్వాదం సద్దుమణగకపోవడంతో సభ ముగిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించి వెళ్లిపోగా.. మిగిలిన కౌన్సిలర్లు సభ నుంచి నిష్క్రమించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, టీపీఓ గోలాపకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ, టీడీపీలో చేరిన కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి

ఆదోని టౌన్: ఆదోని పట్టణం అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాలకవర్గ సభ్యులు తమవంతుగా సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి పాలకవర్గ సభ్యులు గైర్హాజరుకావడం ఏమిటని ప్రశ్నించారు. పాలకవర్గ సభ్యులపై ఎన్నో ఆశలు, ఆశయాలు పెట్టుకొని కౌన్సిలర్లుగా ప్రజలు గెలిపిస్తే వారి ఆశలు, ఆశయాలు నీరుగార్చడం ఎంతవరకు సబబన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, టీపీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూస్తాం

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం బసాపురం ఎల్ఎల్‌సీ కాలువ దగ్గర జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. తుంగభద్ర దిగువ కాలువ నుంచి కొత్తగా నీరు రావడంతో ప్రతి సంవత్సరంలాగే ఈసారి కూడా గంగాహారతి కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



జలహారతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న ప్రతి పథకాలను అర్హులందరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద లబ్ధిదారులైన రైతులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌శేఖర్‌రావు, ఏపీఓ అబ్దుల్‌కాలిక్,, బీజేపీ జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక కౌన్సిల్ సమావేశం వాయిదా



కౌన్సిల్‌లో పాలకవర్గ సభ్యుల కోసం నిరీక్షిస్తున్న చైర్‌పర్సన్ బోయ శాంత



కౌన్సిల్‌కు హాజరైన ఐదుగురు మహిళా పాలకవర్గ సభ్యులు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం కోరం లేక వాయిదా పడింది. బుధవారం చైర్‌పర్సన్ బోయ శాంత అధ్యక్షతన నిర్వహించిన ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశానికి సభ్యులు వివిధ కారణాలు, వ్యక్తిగత కారణాల చేత గైర్హాజరయ్యారు. దీంతో కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ వాయిదా వేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం మధ్యాహ్నం 12 గంటలైనప్పటికీ 1/3వంతు కూడా పాలకవర్గ సభ్యులు హాజరు కాలేదు. సమావేశంలో ఐదుగురు మహిళా కౌన్సిలర్లు, నలుగురు సభ్యులు మాత్రమే పాల్గొన్నారు. దీంతో సమావేశాన్ని చైర్‌పర్సన్ వాయిదా వేశారు. అయితే మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంతపై అవిశ్వాస తీర్మానం పెట్టడం వల్లనే సభ్యులు గైర్హాజరైనట్లు భోగట్టా. మున్సిపల్ కౌన్సిల్‌కు సభ్యులు గైర్హాజరుకావడంపై పట్టణంలో పలు రకాలుగా చర్చ సాగుతోంది.


నిందితుడిని అరెస్టు చేసి, ఎస్ఐని సస్పెండ్ చేయాలి



పోలీస్‌స్టేషన్ వద్ద బైఠాయించిన సర్పంచ్‌ల సంఘం నాయకులు

ఆదోని అర్బన్: మండలంలోని పెద్దపెండేకల్ సర్పంచ్ జయమ్మపై అత్యాచారయత్నం, హత్యా ప్రయత్నం చేసిన తాలారి నరసింహులును కఠినంగా శిక్షించాలని, ఫిర్యాదు చేసే సమయంలో సర్పంచ్‌పై దురుసుగా ప్రవర్తించిన తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామిని సస్పెండ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. ఆదోని జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు జయమ్మను బుధవారం పరామర్శించారు. అనంతరం బాధితురాలితో కలసి తాలూకా పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. సర్పంచు సంఘం నాయకులు, బాధితురాలి బంధువులు పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేశారు. ఎస్ఐ ఎర్రిస్వామిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి నిందితుడిని రేపటిలోగా అరెస్టు చేస్తామని, ఎస్ఐ ప్రవర్తనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా నాయకులు మహబూబ్‌బాషా, రంగారెడ్డి, ఆదోని డివిజన్ అధ్యక్షులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవమ్మ

నందవరం : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని ఎంపీపీ లక్ష్మీదేవమ్మ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీ అ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు మురుగును తొలగించాలన్నారు. దోమల బెడదను అరికట్టి మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధులు రాకుండా చూడాలన్నారు. ముఖ్యంగా తాగునీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అతిసారం వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ముగతి సర్పంచు విరుపాక్షిరెడ్డి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టాలని అధికారులను అడిగారు. సమావేశంలో ఎంపీడీఓ కిరణ్ మోహన్ రావు, తహసీల్దార్ అబ్దుల్ వహీబ్, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఎంఈఓ రామాంజినేయులు, ఏవో స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో ఏడీసీగా పనిచేసిన మల్లికార్జున, కండక్టర్ పనిచేసిన లక్ష్మీదేవిలు పదవీ విరమణ పొందగా.. వారిని ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్, సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండి.గౌస్, ఎంఎస్ వాసులు, ఎన్ఎంయూఏ అధ్యక్ష, కార్యదర్శులు రఫీక్, ముస్తాక్ అహమ్మద్, అధికారులు పంపాపతి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సాంబగల్ ఇనాం భూములను కాపాడండి

ఆదోని రూరల్: సాంబగల్ ఇనాం భూములను కాపాడాలని మాజీ సర్పంచ్ బాలరాజు, మాజీ డీలర్ బాలన్న డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇనాం భూములు కబ్జాకు గురైనా ఇంతవరకు అధికారులు విచారణ చేపట్టడం లేదన్నారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను ప్రభుత్వం కాపాడి స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఆ భూములను భూమిలేని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నిరుపేదలకు పంపిణీ చేయాలన్నారు. ఈ విషయంపై భూమిలేని నిరుపేదల సంతకాలతో కూడిన అర్జీలను సబ్‌కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలిపారు. గ్రామంలో పోతురాజు ఇనాం, దేవత ఇనాం, అలాగే బారికి ఇనాం సుమారుగా 25 ఎకరాల్లో దేవదాయశాఖ పేరుపై ఉందన్నారు. వీటిని దేవదాయశాఖ మీద లేకుండా ఇతరుల పేరు మీద పాసు పుస్తకాలను తయారు చేసుకొని దేవునికి పూజలు చేయకుండా అనుభవిస్తున్నారన్నారు.